క్లుప్తంగా

జోరుగా వరి ఉభాలు



వెంకటరాజపురం పొలాల్లో వరి ఉభాలు వేస్తున్న మహిళా కూలీలు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట పంచాయతీలో జోరుగా వరి ఉభాలు వేస్తున్నారు. వెంకటరాజపురం గ్రామంలో ఆదివారం పలువురు మహిళలు పొలాల్లో వరి నాట్లు వేస్తూ కనిపించారు. మూడు రోజులుగా ఈ పనులు జరుగుతుండడంతో చేతినిండా పని దొరికిందని కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పీహెచ్‌సీలో కవలల జననం



తల్లీబిడ్డలతో నీలకంఠాపురం పీహెచ్‌సీ సిబ్బంది

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో కేదారిలంక గిరిజన గ్రామానికి చెందిన కొండగొర్రి జ్యోతి అనే గిరిజన మహిళ ఇద్దరు కవల పిల్లలకు ఆదివారం జన్మనిచ్చినట్లు స్టాఫ్‌నర్స్ మునమ్మ, ఏఎన్‌ఎం జ్యోతి తెలిపారు. పురిటి నొప్పులతో బాధపడుతున్న ఆమెను ప్రసవం నిమిత్తం పీహెచ్‌సీకి తీసుకురాగా, అక్కడి వైద్య సిబ్బంది సహకారంతో సుఖప్రసవం చేయించారు. ఈ క్రమంలో ఆమె ఓ మగబిడ్డ, ఓ ఆడబిడ్డ కనిందన్నారు. 2.25 కిలోల బరువుతో మగబిడ్డ, రెండు కిలోల బరువుతో ఆడబిడ్డ పుట్టిందన్నారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారన్నారు.

ప్రారంభమైన ప్రయోగ పరీక్షలు

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మంజుల వీణ తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారని, మొత్తం 56 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాధారణ గ్రూపులకు37 కేంద్రాలు, వృత్తి విద్యా కోర్సులకు 19 కేంద్రాలను కేటాయించామన్నారు. తొలిరోజు 2,240 మంది హాజరయ్యారని, ఈనెల 20 వరకు ప్రయోగ పరీక్షలు ఉంటాయని వివరించారు.

మక్కువలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన రంగునాయుడు

మక్కువ: మండల కేంద్రం మక్కువలో రోటరీ బ్లడ్ సెంటర్, మహాలక్ష్మి మెడికల్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన 24 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మెడికల్ షాప్ నిర్వాహకుడు పకీరురాజు తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

పాచిపెంట: మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ బద్నాన ప్రమీల ఆదివారం భూమిపూజ చేశారు. రూ.4 కోట్లతో పి.కోనవలస నుంచి మాతుమూరు వరకు రోడ్డు నిర్మాణం జరగనుందని, ఈ నేపథ్యంలో భూమి పూజచేసినట్లు ఎంపీపీ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర కృషితో ఈ రోడ్డు నిర్మాణం సాధ్యమవుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోలబాబ్జీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో నేత్ర వైద్య సేవలపై సమీక్ష

పార్వతీపురం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 2వ తేదీ నుంచి జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో నిర్వహిస్తున్న నేత్ర పరీక్షలపై నేత్ర వైద్యాధికారులు, నేత్ర వైద్య సహాయకులతో జిల్లా అంధత్వ నివారణాధికారి డా.సుకుమార్ బాబు ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేషెంట్‌కి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసి నేత్ర పరీక్షలు నిర్వహించాలన్నారు. గతంలో పాఠశాలల్లో కంటి తనిఖీలు చేసిన వారిలో దృష్టి దోషం ఉన్న విద్యార్థులకు, ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నేత్ర పరీక్షలు చేసిన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు చేసిన వారి వివరాలు సురక్ష పోర్టల్‌లో ఎలా పొందు పరచాలో, ఇంకా 585 మందికి జిల్లా వ్యాప్తంగా శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి ప్రత్యేక ప్రణాళిక వివరించారు. ఇప్పటికే 9150 మందికి కళ్ల జోళ్లు, 500 మందికి శస్త్ర చికిత్సలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి డా. జీరు నగేష్ రెడ్డి, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి శస్త్ర చికిత్స నిపుణుడు డా.సుకుమార్ బాబు, నేత్ర వైద్య సిబ్బంది, జిల్లా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బాబుది మోసం.. జగనన్నది అభయం...

- తెట్టంగిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు
- మాట నిలబెట్టుకోలేకపోయిన వైనం..
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జోరుగా అభివృద్ధి
- భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి
- అండగా నిలుస్తున్న జగనన్న సంక్షేమ పథకాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న తెట్టంగి ప్రజానీకం



రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం

ఇది కదా.. అభివృద్ధి

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామం ప్రగతిపథంలో దూసుకుపోతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామం రూపురేఖలు మారిపోవడంతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలు సంతృప్తికర స్థాయిలో అందుతుండడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉంటే 2017 సెప్టెంబర్ 11న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెట్టంగి గ్రామంలో పర్యటించి, ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. సీఎం హోదాలో హామీ ఇవ్వడంతో ఇక తమ బతుకులు మారుతాయని గ్రామస్తులు ఆశించారు. అయితే వీరి ఆశలను అడియాసలు చేస్తూ చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని టీడీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి పల్లెనూ ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టారు. ఈక్రమంలో స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సహకారంతో తెట్టంగి గ్రామాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు సమకూరడంతో అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి.

చంద్రబాబు ఇచ్చిన హామీలివి...

2017 సెప్టెంబర్ 11వ తేదీన ముఖ్యమంత్రి హోదాలో తెట్టంగి గ్రామానికి వచ్చిన నారా చంద్రబాబునాయుడు ఆదర్శ గ్రామంగా తెట్టంగిని ప్రకటించారు. పక్కా రోడ్లు వేసి, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయడంతో పాటు పశువైద్యశాల, పీహెచ్‌సీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అయితే వీటిలో ఒక్క హామీ కూడా ఆ ప్రభుత్వ హయాంలో నెరవేరలేదు. దీంతో టీడీపీ ప్రభుత్వం తీరుపై తెట్టంగి ప్రజలు అప్పటిలో తీవ్ర విమర్శలు చేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తెట్టంగి గ్రామంలో రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనాన్ని అద్భుతంగా నిర్మించారు. సిబ్బందిని అందుబాటులో ఉంచి అన్ని రకాల సేవలూ గ్రామంలోనే అందినట్లు చేశారు. మరో రూ.40 లక్షలతో నిర్మిస్తున్న రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ల భవనాలు చివరి దశ నిర్మాణంలో ఉన్నాయి. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా గ్రామంలో నలుగురు పేదలకు వైద్య ఖర్చుల కోసం రూ.1.60 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే గ్రామంలో రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. రూ.15 లక్షల నిధులో మురుగు కాలువలు నిర్మించడంతో పాటు 6 లక్షల రూపాయలతో కల్వర్టులు నిర్మించారు. గ్రామంలో కొన్ని వీధులకు రూ. 9.50 లక్షల వ్యయంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. ఆర్‌సీఎం చర్చి వీధి, సీబీఎం చర్చి వీధి, బంగారుతల్లి వీధితో పాటు శ్మశానవాటికల్లో రూ.3.65 లక్షలతో బోరుబావులు ఏర్పాటు చేశారు. 'నాడు – నేడు' నిధులు రూ.18 లక్షలతో ఎంపీపీ స్కూల్‌ను అభివృద్ధి చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు మరో 60 లక్షల రూపాయలతో అదనపు భవనాలను నిర్మిస్తున్నారు. అలాగే తెట్టంగి – నీలానగరం రోడ్డును అభివృద్ధి చేయడంతో పాటు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి గ్రామాభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించారు. అంతే కాకుండా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా నిలిచారని గ్రామస్తులు చెబుతున్నారు.



సీబీఎం చర్చి వీధిలో నిర్మించిన సీసీ రహదారి

వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే మా గ్రామం అభివృద్ధి చెందింది. 2017 సెప్టెంబర్ 11న మా గ్రామానికి ముఖ్యమంత్రి హోదాలో వచ్చిన చంద్రబాబునాయుడు ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. మేమంతా ఎంతో సంతోషించాం. కానీ హామీ నెరవేర్చలేకపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చెందింది.

– పొట్నూరు లక్ష్మణరావు, ఏఎంసీ వైస్ చైర్మన్, తెట్టంగి

అర్హత ఉంటే చాలు..



ముఖ్యమంత్రి జగన్‌బాబు ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పింఛన్లు మంజూరవుతున్నాయి. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటికి వచ్చి వివరాలు సేకరించి పథకాలు మంజూరు చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం చాలా ఇబ్బందులు పడ్డారు. జన్మభూమి కమిటీ సభ్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ప్రస్తుత ప్రభుత్వ పనితీరుపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. – అలజంగి విజయ, సర్పంచ్,తెట్టంగి



రూ.22.5 లక్షలతో నిర్మిస్తున్న రైతుభరోసా కేంద్ర భవనం



పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లు

జోరుగా అభివృద్ధి పనులు



గ్రామాభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. నాడు – నేడుతో పాఠశాలలను అభివృద్ధి చేశారు. సీసీ రోడ్లు, కల్వర్టులు, కాలువలు నిర్మించారు. లక్షలాది రూపాయలతో ప్రభుత్వ భవనాలు నిర్మించారు. సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలన్నీ ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. – సతివాద చిన్నంనాయుడు, మాజీ సర్పంచ్, తెట్టంగి



ప్రగతిపథంలో దూసుకుపోతున్న తెట్టంగి గ్రామం

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో ఆదివారం సుదర్శన హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాగడహారతి వంటి పూజలు చేసి, అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ సహకారంతో అర్చకులు సత్తి నరసింహాచార్యులు భక్తులతో హోమం జరిపించారు. ఈ హోమం చేయడం ద్వారా బాధలు తొలగి, కోరిన కోర్కెలు నెరవేరుతాయన్నది భక్తుల నమ్మకం. హోమం చేసే దంపతులకు దీక్షా వస్త్రాలను కమిటీ సభ్యులు అందజేశారు. మధ్యాహ్నం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు



సింగిడిలో సాగవుతున్న మొక్కజొన్న

భామిని: మండలంలో మొక్కజొన్న సాగు ఆశాజనకంగా సాగుతోంది. ఖరీఫ్ వరి కోతలు కోసిన పోలాల్లో రబీ సీజన్‌లో భాగంగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించడంతో పాటు వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు సాగుకు మొగ్గు చూపిస్తున్నారు. గతంలో కీసర, కోసలి, ఘనసర, పెద్దదిమిలి ప్రాంతాలకు పరిమితమైన మొక్కజొన్న పంట ప్రస్తుతం కాట్రగడ–బి, గురండి, నేరడి, బిల్లుమడ, నులకజోడు, సింగిడి, పసుకుడి ప్రాంతాలలో కూడా సాగు చేస్తున్నారు. సాధారణ మొక్కజొన్నతో పాటు స్వీట్‌కార్న్ కూడా సాగవుతోంది.

టీడీపీలో శంఖారావం ముసలం

- రెండు వర్గాలుగా ఏర్పడి ఏర్పాట్లు
- యాత్రను విజయవంతం చేయాలని కోరిన జయకృష్ణ వ్యతిరేక వర్గం



మాట్లాడుతున్న సామంతుల, తదితరులు

పాలకొండ: నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో టీడీపీ నాయకుడు లోకేష్ శంఖారావం యాత్ర వల్ల మరింత ముసలం పుట్టింది. ఈ నెల 13న పాలకొండలో లోకేష్ శంఖారావం యాత్ర చేపట్టనున్నారు. దీంతో రెండు గ్రూపులుగా పనిచేస్తున్న ఆ పార్టీ నాయకులు తమ బలాబలాలు చూపించేందుకు సిద్ధం అవుతున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ తన వర్గంతో ఒకవైపు లోకేష్ యాత్ర కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇదే సమయంలో నియోజకవర్గంలోని సీనియర్ నాయకులు సామంతుల దామోదరరావు, కండాపు వెంకటరమణ, వారాడ సుమంత్‌నాయుడు, పడాల భూదేవి, బిడ్డిక దమయంతినాయుడు, సవర మాలయ్య, తదితరులు ఆదివారం సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామంతుల, తదితరులు మాట్లాడుతూ, లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. పాలకొండలో గెలిచే అభ్యర్థినే పెడతామని పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారని పరోక్షంగా జయకృష్ణకు టికెట్ ఇవ్వరని తెలిపారు. సీతంపేట మండలానికి చెందిన వ్యక్తికి టికెట్ ఇస్తే గెలుపు అవకాశాలున్నాయని చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి జయకృష్ణను వ్యతిరేకిస్తున్న టీడీపీ నాయకులను కూడగట్టి మీడియా సమావేశం నిర్వహించడం విశేషం. గత జులైలో వీరఘట్టం మండలం విక్రంపురం వద్ద జరిగిన చంద్రబాబు భవిష్‌త్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఇదే వర్గానికి, జయకృష్ణ వర్గానికి మధ్య తోపులాట జరిగింది. ఇరు వర్గాలు టికెట్ మాకు అంటే మాకు అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ప్రస్తుత లోకేష్ పర్యటలో నియోజవర్గం టికెట్ ప్రకటన వస్తుందని ఎదురు చూస్తున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

సీతంపేట: ఇంటర్మీడియట్ జనరల్, వృత్తివిద్యాకోర్సులకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్థానిక గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు, బాలుర కళాశాలలో జనరల్‌తో పాటు వొకేషనల్ కోర్సులకు ప్రాక్టికల్స్ నిర్వహించారు. సీఎస్‌లుగా పైడి నాగభూషణరావు, పి.సూర్యకుమారి వ్యవహరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.జగదీష్‌కుమార్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

చింతాడలో గ్రామసందర్శన



చింతాడ గ్రామస్తులకు సూచనలు చేస్తున్న ఎస్సై ప్రశాంత్‌కుమార్

పాలకొండ రూరల్: గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా ఎస్సై ఎస్.హేమంత్‌కుమార్ మండలంలోని చింతాడ గ్రామాన్ని ఆదివారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ, ఎన్నికల సీజన్ కాబట్టి గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా సహకరించాలని కోరారు. యువత ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని హితవు పలికారు. అనంతరం పాలకొండ – సీతంపేట రహదారిలో ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు అతిక్రమించిన వాహనచోదకులకు అపరాధ రుసుం విధించారు.

పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం: అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందజేయడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంఓ డాక్టర్ టి జగన్‌మోహనరావు సూచించారు. ఈ మేరకు సీతానగ రం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆదివారం ఆయన సందర్శించి ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రి కి వచ్చిన వారికి వైద్య సేవలందించారు. అనంత రం పీహెచ్‌సీలో ఉంచిన మందులు, వైద్య సేవలకోసం వచ్చిన రోగుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురై వైద్య సేవల కోసం వచ్చిన వారినుంచి వ్యాధి లక్షణాలు, ఇంతకు ముందు ఏమైనా మందులు వాడారా? తదితర అంశాలను అడిగి తెలుసుకున్న తరువాత వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధినివారణకు మందులు ఇవ్వాలని సూచించారు. ప్రధాన రహదారిని అనుకుని పీహెచ్‌సీ ఉన్నందున ఉన్నతాధికారుల తాకిడి ఉంటుందని, అత్యవసర వైద్య సేవల కోసం ఎక్కువగా వస్తుంటారని తెలియజేశారు. ఈ మేరకు పీహెచ్‌సీలో అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

20న స్వామివార్ల కల్యాణ మహోత్సవం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: గరుగుబిల్లి మండలంలోని తోటపల్లిలో ఈ నెల 20వ తేదీన శ్రీవేంకటేశ్వరస్వామితో పాటు కోదండరామస్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, ఆలయ కార్యనిర్వహణాధికారి వి.వి.సూర్యనారాయణ తెలిపారు. వీటికి సంబంధించిన ఆహ్వాన పత్రికలు, వాల్‌పోస్టర్లను చినమేరంగిలో కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు.

అనంతరం కార్యక్రమానికి తప్పకుండా రావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు గౌరీశంకర పాత్రో, గంటేడ సింహాచలంనాయుడు, ఆలయ అర్చకులు వి.వి.అప్పలాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



తాడికొండ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఈవో జనార్ధన్‌నాయుడు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఇరిడి, తాడికొండ, కేదారిపురం, చాపరాయి జంగిడిభద్ర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ బి.ఎస్.ఎస్.సత్యనారాయణ, ఎంఈవో బి.జనార్ధన్ నాయుడు కలిసి ఆదివారం పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఉన్నాయా.. లేవా అనే అంశం పరిశీలించారు. మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్ వంటి వసతులతో పాటు దివ్యాంగ ఓటర్ల కోసం ర్యాంపు వంటి సదుపాయం ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట సర్వేయర్ పాపారావు, బీఎల్‌వోలు, తదితరులు ఉన్నారు.

మెగా వాటర్‌ప్లాంట్ పనులు ప్రారంభం



బురుజోల కూడలి వద్ద సిద్ధంచేసిన పైప్‌లు

భామిని: జల్‌జీవన్ మిషన్ ఆధ్వర్యంలో భాగంగా నిర్మించనున్న మెగా వాటర్‌ప్లాంట్ పనులు ప్రారంభమయ్యాయి. మండలంలోని బురుజోల మెట్ట వద్ద మండల స్థాయి మెగా వాటర్ ట్యాంక్ నిర్మించి, అక్కడ నుంచి పైప్‌లైన్ల ద్వారా గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బిల్లుమడ – సింగిడి గ్రామాల మధ్య గల వంశధార నది నుంచి బురుజోల మెట్ట వరకు నీరు తరలించడానికి అనువుగా పైపులైన్లు వేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పైప్‌లను బురుజోల కూడలి, ఏబీ రోడ్డుపై ఆదివారం వేశారు.

ముగిసిన నిత్యజీవ ఆశీర్వాద పండగ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గిరిశిఖర గ్రామమైన గోరటిలో విశ్వవాణి ఆధ్వర్యంలో జరుగుతున్న నిత్యజీవ ఆశీర్వాద పండగ సోమవారం ముగిసింది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాలకు చెందిన క్రైస్తవులతో పాటు ఒడిశా ప్రాంతానికి చెందిన మతవిశ్వాసులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని, ఏసుక్రీస్తును ఆరాధించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవాణి స్టేట్ కో–ఆర్డినేటర్ పాస్టర్ సునీల్ హాజరై, ఏసు ప్రభువు సందేశం చదివి వినిపించారు. ప్రతిఒక్కరూ నీతి, నిజాయితీతో జీవించి, సమాధానం కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, రోగులకు ఉచితంగా వైద్యసేవలు, మందులు అందజేశారు.



దుమ్మురేగుతోంది..

మండలంలోని ఏబీ రోడ్డు వెంబడి దుమ్మురేగుతోంది. రోడ్డు విస్తరణ పనులు ఓ పక్క జరుగుతుండగా... ఒడిశా నుంచి వస్తున్న భారీ లారీల వల్ల దుమ్మురేగడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. పనులు చేపడుతున్న సమయంలోనే వాటరింగ్ చేస్తూ రోలింగ్ చేయడం వల్ల దుమ్ము కష్టాలు తీరుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా అధికారులు ఆలోచించాలని కోరుతున్నారు.

– భామిని